www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025 5 ఏలూరు



నేడు జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 19వ తేదీన ఉదయం 11 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12:30 గంటలకు ఉంగుటూరు చేరుకుంటారు. స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం రెండు గంటలకు ఉంగుటూరు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2:30 గంటలకు ఏలూరు రెవెన్యూ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించే జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్తారు.

మత్స్యశాఖ రూటే వేరు..!

ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు బేఖాతార్

నిడమర్రు మండల ఎఫ్‌డిఒపై పది రోజుల్లో విచారణ పూర్తికి ఆదేశాలు

దాదాపు నెలరోజులైనా పూర్తికాని పరిస్థితి

విచారణ అధికారి వ్యాఖ్యలతో రైతుల్లో ఆందోళన


పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై సరైన స్పందన కరువు

పదేపదే రీఓపెన్ చేసి, రాష్ట్రస్థాయి అధికారులు జోక్యం చేసుకుంటేనే కదలిక

ప్రభుత్వ పంట బోదెను కలిపేసుకున్న చేపల చెరువుకు స్పష్టమైన నోటీసులు ఇవ్వని పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా మత్స్యశాఖ అధికారులు తమ రూటే సపరేటు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలిస్తున్న ఫిర్యాదులపై మత్స్యశాఖ అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారుల వరకూ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను పరిష్కరించకుండానే ఏదో కారణం చూపి ముగించేయడంతో బాధితులు పదేపదే రీఓపెన్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నిడమర్రు మండలం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 164–2, 3 మరికొన్ని సర్వే నెంబర్లలో సన్న, చిన్నకారు రైతులు తవ్వుకున్న చేపల చెరువు వ్యవహారంలో ఏర్పడిన సమస్యపై మత్స్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మండలంలో పనిచేసే ఆ శాఖ ఎఫ్‌డిఒ పక్కనే ఉన్న దాదాపు 150 ఎకరాల చేపల చెరువులకు సంబంధించిన బడాబాబులకు కొమ్ముకాస్తూ సామాన్య రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంపై బాధిత రైతులు అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎఫ్‌డిఒ ఇష్టానుసారంగా నోటీసులు జారీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. దీనిపై బాధిత రైతులు అనేకసార్లు డివిజన్, జిల్లా మత్స్యశాఖ



Office of the Commissioner of Fisheries
Poranki (Post), Bandar Road, Vijayawada- 521137

mo No.4377/P2/2017 Date: 23.04.2025

Fisheries – PGRS - Representation from Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West Godavari District -take necessary action- Regarding

1) Representation Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West Godavari District received on 05.03.2025
2) This Office Memo No.4377/P2/2017 Dated 17.04.2025
3) Representation Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West Godavari District received on 15.04.2025

The attention of the District Fisheries Officers of Eluru Districts is invited to the ...erence 2nd cited, wherein, this office has requested the District Fisheries Officer of West ...davari to conduct enquiry and take necessary action in the matter as per rules in vogue

Vide 3rd cited Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West ...davari District has once again requested to conduct enquiry regarding allegations on FDO, ...damarru of Eluru District (Copy enclosed)

In view of above, the DFO of Eluru district is requested to find enclosed copy of the ...resentation, conduct enquiry and take necessary action in the matter as per rules in vogue and ...nish action taken report to applicant under copy to Head Office with 10 days from receipt of

Addl Director of Fisheries

పదిరోజుల్లో విచారణ పూర్తిచేయాలంటూ దాదాపు నెల రోజుల క్రితం మత్స్యశాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల కాపీ

అధికారులకు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో బాధితులు వేరే గత్యంతరం లేక మత్స్యశాఖ కమిషనర్‌కు పిజిఆర్ఎస్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై స్పందించిన కమిషనర్ కార్యాలయంలో నిడమర్రు మండలం ఎఫ్‌డిఒపై వెంటనే విచారణ జరిపి పది రోజుల్లో నివేదిక సమర్పించాలని ఏప్రిల్ 17వ తేదీన జిల్లా మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఏప్రిల్ 23న కమిషనర్ కార్యాలయం ఇదే విషయంపై మరోసారి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారులు కైకలూరు ఎడి రాజకుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. దాదాపు నెల రోజులు గడిచినా ఇప్పటివరకూ ఆయన విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వలేదు. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాలపై ఈ విధమైన నిర్లక్ష్యం వహించడం జిల్లాలోని మత్స్యశాఖ అధికారుల తీరును ప్రస్ఫుటం చేస్తోంది. ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలను సైతం పాటించకపోవడం విస్మయాన్ని గురిచేస్తోంది.

విచారణ అధికారి తీరుతో రైతుల్లో ఆందోళన

నిడమర్రు మండలంలోని మత్స్యశాఖ ఎఫ్‌డిఒ నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన నోటీసులపై బాధితులు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌డిఒ నీటి హక్కులపై జారీ చేసిన నోటీసుపై రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఎఫ్‌డిఒ అధికార దుర్వినియోగంపై బాధిత రైతులు మత్స్యశాఖ అధికారులకు పదేపదే ఫిర్యాదు చేశారు. విచారణ అధికారి ఆ నోటీసులపై కాకుండా ఇతర కోణంలో విచారణ జరుపుతున్నారంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మీ చెరువు పక్క చెరువుదారునికి ఇవ్వొచ్చు కదా వంటి ప్రశ్నలు వేయడంపై రైతులకు పలు అనుమానాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఎఫ్‌డిఒ జారీచేసిన నోటీసుల కారణంగా తొమ్మిది నెలలుగా చెరువు సాగుకు నోచుకోని పరిస్థితి ఉందని, విచారణ అధికారి ఆ విషయంపై కాకుండా వేరే కోణంలో విచారణ చేస్తున్నారన్న అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. విచారణ పారదర్శకంగా జరగాలని రైతులు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ భూమి ఉన్నా నోటీసులు ఇవ్వని పరిస్థితి

సర్వే నెంబర్ 148–163లో తప్పిన 70 ఎకరాల చేపల చెరువుల్లో ప్రభుత్వ పంట బోదె ఉన్నట్లు ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఇప్పటివరకూ మత్స్యశాఖ అధికారులు అవతలి వైపువారికి స్పష్టమైన నోటీసులు జారీ చేయలేదని రైతులు చెబుతున్నారు. మండల తహశీల్దార్ ధ్రువీకరించలేదంటూ మత్స్యశాఖ అధికారులు చెబుతూ వస్తుండటం మరింత విడ్డూరంగా ఉంది. ఇప్పటికే తహశీల్దార్ పంట బోదెను నిర్ధారణ చేసి అక్కడ బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూ అధికారులు నిర్ధారణ చేసినప్పటికీ మత్స్యశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మత్స్యశాఖ మండలాధికారి పట్టించుకోకపోతే డివిజన్, జిల్లా అధికారులు సైతం చర్యలు తీసుకోవాలని లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఒత్తిడి మేరకు కొద్ది మంది రైతులకు వివరణ నోటీసులు ఇచ్చి మమ అనిపించినట్లు తెలుస్తోంది. సమస్యను పరిష్కరించే దిశగా మత్స్యశాఖ అధికారులు వ్యవహరించడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యపై జిల్లా కమిటీ చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకువెళ్లాలో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

విచారణ నివేదిక ఇంకా అందలేదు

బి.నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఏలూరు

నిడమర్రు మండలం ఎఫ్‌డిఒపై వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ కార్యాలయం ఆదేశాల మేరకు కైకలూరు ఎడి రాజకుమార్‌ను విచారణ అధికారిగా నియమించడం జరిగింది. ఇంకా విచారణ నివేదిక నా వద్దకు రాలేదు. ఫిర్యాదు ఆధారంగానే విచారణ ఉంటుంది. పారదర్శకంగానే విచారణ కొసాగుతుంది

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న మూడు రోజుల పాటు కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ 1800 233 1077తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేవిధంగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల ప్రధాన కేంద్రంలో, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చిన్నారుల మృతదేహాలను బయటకు తీస్తున్న దృశ్యం

తల్లి కళ్లెదుటే జలసమాధి..

జల్లేరు జలాశయంలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వేసవి సెలవులు అని సరదాగా గడుపుదామనుకున్నారు.. అంతా కలిసి జల్లేరు జలాశయానికి వచ్చారు.. అప్పటివరకూ ముద్దుముద్దు మాటలతో అల్లరి చేసిన పిల్లలు కళ్లెదుటే నీట మునిగిపోయారు.. కాపాడుకునేలోపే గల్లంతయ్యారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తన ఇద్దరు బిడ్డలు మృతి చెందడంతో ఆ తల్లి గుండలవిసేలా రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. ఈ సంఘటన బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలో జల్లేరు జలాశం వద్ద ఆదివారం చోటుచేసుకుంది.

వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడేనికి చెందిన షేక్ అన్వర్, షేక్ పర్వీన్ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు షేక్ అబ్దుల్ (10), షేక్ సిద్దిక్ (7). షేక్ అన్వర్ తాడేపల్లిగూడెంలో చెప్పుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తల్లి షేక్ పర్వీన్, ఇద్దరు పిల్లలు, చెల్లెళ్లు షేక్ నగీనా, షేక్ నూర్‌తో కలిసి వేసవి సెలవులు కావడం ఆదివారం జంగారెడ్డిగూడెం బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయానికి సరదాగా గడపడానికి వచ్చారు. డ్యామ్ వద్ద అందరూ కూర్చొని సరదాగా గడుపుతూ ఉండగా పిల్లలు నీటిలోకి దిగి మునిగిపోయారు. దీంతో తల్లి పర్వీను, పిన్ని నగీనా పిల్లలను కాపాడడానికి నీటిలోకి దిగారు. అప్పటికే పిల్లలిద్దరూ నీటిలో మునిగిపోగా అటువైపుగా వస్తున్న కొంతమంది చేపలు పట్టేవారు తల్లిని, పిన్నినిపైకి లాగి కాపాడారు. అప్పటికే నీటిలో మునిగిపోయిన పిల్లల ఆచూకీ తెలియకపోయేసరికి బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటీన ఎస్ఐ దుర్గామహేశ్వరరావు, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం చేపలు పట్టే ఇసురు వలలో చిన్నారుల మృతదేహాలు చిక్కుకుని ఉన్నాయి. చనిపోయినా కూడా ఒకరి చేతిని ఒకరు పట్టుకుని ఉండడాన్ని చూసి తల్లి పర్వీన్ సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు, తల్లిదండ్రులు బంధువులు కన్నీరుతో శోకసంద్రంలో మునిగిపోయారు. పిల్లలను బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేసి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రికి తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం నుంచి బంధువులు అధిక సంఖ్యలో చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.



స్పృహ తప్పి పడిపోయిన తల్లి, రోదిస్తున్న బంధువులు



మృతిచెందిన షేక్ అబ్దుల్



మృతిచెందిన షేక్ సిద్దిక్

ప్రజాసమస్యలపై.. నేరుగా కలెక్టర్..!

వైద్యసేవలపై కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేక దృష్టి

పిహెచ్‌సిలో వైద్యులు అందుబాటుపై రాత్రి 12 గంటలకు పరిశీలన

పిజిఆర్ఎస్ సమస్యల పైనేరుగా బాధితులకు ఫోన్లు, వారి ఇళ్లకు కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజాసమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నేరుగా రంగంలోకి దిగారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, పిజిఆర్ఎస్ సమస్యలపై బాధితులకు నేరుగా ఫోన్ చేయడం, ఇంటికెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల పోలవరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా గర్భిణీ మృతి చెందిన ఘటనను కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్న పరిస్థితి నెలకొంది. దీంతో రాత్రిపూట వైద్యులు ఆసుపత్రులకు వెళ్తున్నారో లేదో అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో అధికారులను పంపి పరిశీలన చేయిస్తూ వివరాలు తెలుసుకున్నారు. శనివారం అర్ధరాత్రి కలెక్టర్ వెట్రిసెల్వి నేరుగా రంగంలోకి దిగి ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యుల హాజరుపై అధికారులను పంపి పరిశీలన జరిపారు. దీంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రభుత్వ ఆసుపత్రులపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించడం ఏజెన్సీ ప్రజలకు మరింత మేలు కలగనుంది. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల సేవా లోపం కారణంగా జిల్లాలో ఏ ఒక్క మరణం సంభవించకూడదన్న లక్ష్యంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులన్నింటిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండే విధంగా కలెక్టర్ చర్యలు చేపట్టారు. జిల్లాలోని సిహెచ్‌సిలు, పిహెచ్‌సిల్లో డాక్టర్లు ప్రజలకు ముఖ్యంగా రాత్రి సమయాల్లో అందుబాటులో ఉంటున్నారా లేదా అంటూ ఆకస్మికంగా తనిఖీలు చేసే ప్రక్రియను కలెక్టర్ చేపట్టారు.



పోలవరం పిహెచ్‌సిలో డాక్టర్ల విధుల హాజరును పరిశీలిస్తున్న తహశీల్దార్

పిజిఆర్ఎస్ ఫిర్యాదుపై నేరుగా ఇంటికి..

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి రెండురోజుల క్రితం 40వ డివిజన్ ఏటుగట్టు, ఏడో నెంబరులో పూరి గుడిసెలో నివాసముంటున్న పెదపూడి లీలమ్మను నేరుగా కలిశారు. ఆమె ఇబ్బందులను, ఆరోగ్య వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని ఆవేదన చెందారు. శిథిలావస్థకు చేరిన పూరి గుడిసె స్థానంలో నెల రోజుల్లో సిఎస్ఆర్ నిధులతో ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. అంత్యోదయ అన్నయోజన 30 కేజీలు బియ్యం కార్డు మంజూరుకు జిల్లా కలెక్టరు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆమెకు తోడుగా ఉంటున్న పెద్ద కుమార్తెకు టిడ్కో ఇల్లు మంజూరైందని, ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని ఇల్లు పూర్తి చేసి ఆమెకు స్వాధీనం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆమెకు కలెక్టర్ భరోసా ఇచ్చారు.

రూ.450 కోట్లతో నాలుగు ఆర్‌ఒబిలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.450 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వెల్లడించారు. ఆదివారం ఉంగుటూరు రైల్వే గేట్‌ను ఎంఎల్ఎ ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి సందర్శించారు. భీమడోలు, కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు నాలుగు చోట్ల ఆర్‌ఒబి నిర్మాణం చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారానికి గాను రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభ పరిణామమని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచి బండారు సింధు, టిడిపి మండల కమిటీ అధ్యక్షులు వేములపల్లి సుధీర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపీ మహేష్ కుమార్ యాదవ్

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

మద్దతు తెలిపిన కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ పిలుపు మేరకు బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాలుగో రోజు కొనసాగాయి. దీక్షలో చేస్తున్న పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన సమితి సభ్యులకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు మాట్లాడుతూ డిమాండ్లు నెరవేరేవరకూ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. మెగా డిఎస్‌సిలో నోటిఫై చేసిన షెడ్యూల్ ప్రాంత పోస్టులకు విడిగా ఏజెన్సీ డిఎస్‌సి ప్రకటించాలన్నారు. ఆదివాసీ మహాసభ జిల్లా కార్యదర్శి మూలెం రాంబాబు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం వెంటనే చేయాలన్నారు. సిఎం తన హామీని చిత్తశుద్ధితో నెరవేర్చాలని కోరారు. ఆదివాసీ కొండారెడ్ల సంఘం జిల్లా అధ్యక్షులు పట్ల రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టి ఎంఎల్‌ఎలందరూ తక్షణమే డిఎస్‌సి ఏర్పాటు కోసం ముఖ్యమంత్రిని కలవాలని కోరారు. ఎటిఎ రాష్ట్ర గౌరవ సలహాదారు తెల్లం రాములు, అచ్చుయ్య పాలెం ప్రెసిడెంట్ కుంజా వెంకటేశ్వరరావు, ఎజెసి జిల్లా ప్రధాన కార్యదర్శి సోదెం ముక్కయ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు రవ్వ బసవరాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి పోడియం కొవ్వాడయ్య, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తెల్లం శ్రీనివాస్, కన్నప్ప రాజు, ముడియం రాముడు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నేతలు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జిల్లా స్థాయితో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చని తెలిపారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్ మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య నేర్పడం చాలా అవసరమని, అనేకమంది నిపుణులతో కూడిన బృందం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు తోడ్పడిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీలు సంయుక్తంగా హైస్కూల్లో నిర్వహించిన 15 రోజుల సమ్మర్ క్యాంపు ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. సభకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. సభలో హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘ కమిటీ ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, మానవతా జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు, కార్యదర్శి పిడి.రత్నాకరరావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ నగరంలోని వివిధ రంగాల్లో పిల్లలకు నైపుణ్యాన్ని అభివృద్ధి చేయగలిగిన వారందరి భాగస్వామ్యంతో ఎఆర్ డిజికె హైస్కూల్ హెచ్‌ఎం, టీచర్స్ ఇచ్చిన అవకాశంతో హేలాపురి సమ్మర్ క్యాంపు జయప్రదమైందన్నారు. శిక్షణ ఇచ్చిన వారికి, పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. పిల్లలు అన్నింటా ఎదగాలని, బాగా చదవాలని కోరుతూ ఒక పాట పాడి ఉత్తేజపరిచారు. మానవత జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులకు కొన్ని విషయాలు నేర్పడం కోసం అనేకమంది ఈ సమ్మర్ క్యాంపులో తోడ్పాటు అందించారని, తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలని చెప్పారు. హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి సెలవుల్లో ప్రత్యేకమైన అంశాల్లో శిక్షణ ఇవ్వడం కోసం ఏర్పాటు చేసిన హేలాపురి క్యాంపు జయప్రదంగా పూర్తయిందని, భవిష్యత్తులో కూడా పిల్లలను అన్ని రకాలుగా తీర్చిదిద్దడానికి తాము చేసే ప్రయత్నానికి తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని కోరారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 80 మంది విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో తమ పేర్లు నమోదు చేసుకుని శిక్షణ ఉపయోగించుకున్నారన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రం, స్పోకెన్ ఇంగ్లీష్ 15 రోజుల క్యాంపు, సమ్మర్ క్యాంపులో అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆసక్తిని బట్టి వారం వారం కూడా కొనసాగిస్తామని తెలిపారు. 15 రోజుల పాటు శిక్షణలో విద్యార్థులకు అనేక అంశాల్లో మెళకువలు నేర్పి వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికి తోడ్పడిన పిఎల్.నాగేశ్వరరావు, వై.ఆనందనాయుడు, దొర శివప్రసాద్, కె.సిమ్హానాయక్, జి.ప్రసాద్, కొవ్వలి శ్రీనివాస్, ఎం.సురేష్‌బాబు, ఎస్.కస్తూరిరావు, దేవరకొండ వెంకటేశ్వర్లుకు మెడల్స్, ప్రశంసపత్రాలు అందించి సత్కరించారు. ఆయా అంశాల్లో తమ కళలను ప్రదర్శించిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంస పత్రాలు, మెడల్స్ ఇచ్చి అభినందించారు. 15 రోజుల వేసవి శిక్షణా కార్యక్రమాన్ని హేలాపురి సోషల్ సెంటర్ సూపర్‌వైజర్ కె.జనని సమన్వయం చేశారు.



ప్రశంసపత్రాలు అందుకున్న విద్యార్థులు

ఉరుములతో దద్దరిల్లిన కుక్కునూరు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల కేంద్రమైన కుక్కునూరులో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మూడు చోట్ల పిడుగులు పడ్డాయి. ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లోని తాటిచెట్టుపై, గణేష్‌నగర్ సెంటర్‌లోని ఖాళీ స్థలంలో, సినిమా హాల్ సెంటర్ వద్ద తాటిచెట్టుపై పిడుగులు పడ్డాయి. చెలరేగిన మంటలను ఫైర్ సిబ్బంది అదుపుచేశారు. అప్పటివరకు భానుడి ప్రతాపంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుముటు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.



కుక్కునూరులో పడిన పిడుగు

పగలు సూర్యుని భగభగలు...

రాత్రుళ్లు వరుణుడి చిటపటలు

కలిదిండి: గత మూడు రోజుల నుంచి పగలు సూర్యుని వేడిమితో పాటు ఉక్కపోత తాళలేక ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఆ క్రమంలోనే రాత్రిళ్లు ఆకాశంలో మేఘాలు కమ్మేయడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు వల్ల కొంత ఉపశమనం పొందుతున్నారు. పగలు సూర్యుని దెబ్బకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రధాన సెంటర్‌లోని పలు దుకాణాలు మధ్యాహ్నం 12 గంటలకు మూసివేసి, సాయంత్రం నాలుగు గంటలకు తెరుస్తున్నారు. రాత్రిళ్లు ఉరుములు ఇళ్ల మీదగా వెళ్తున్నట్లుగా ఉండడంతో మీద పడతాయోమోననే భ్రాంతితో జనం హడలిపోతున్నారు. దీనికి తోడు అడపా దడపా కరెంట్ కోతలతో చీకట్లో మగ్గిపోతున్నారు. గత మూడు రోజులుగా వాతావరణం ఈ విధంగా ఉండటంతో ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రొయ్యలకు ఆక్సిజన్ కొరత లేకుండా ఏరియేటర్స్‌పై ఆధారపడుతున్నారు. చెరువుల వద్దే రైతులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.



కలిదిండిలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

25న కళా సాంస్కృతిక సమాలోచన సభ

ప్రజాశక్తి - ఏలూరు

రాజా రామ్మోహన్ రాయ్ జయంతిని, కందుకూరి వీరేశలింగం వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 25న కళా సాంస్కృతిక సమాలోచన సభ నిర్వహించనున్నారు. ఏలూరులోని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవత, జనవిజ్ఞాన వేదిక, యుటిఎఫ్, అరసం, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్, సాహితీ స్రవంతి సంయుక్తంగా ఏలూరులోని సాయిపదమండలిలో 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహిస్తున్నామని ఆయా సంఘాల ప్రతినిధులు చెప్పారు. ఆదివారం ఎఆర్‌డిజి హైస్కూల్‌లో నిర్వాహక సంఘాల సమావేశం నిర్వహించారు. సతీసహగమనం, వితంతు వివాహాలు, మహిళా విద్య మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన, వివిధ అంశాల్లో మార్గదర్శక రచనలు చేసిన రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగంలు ఆదర్శంగా తీసుకుని మహిళలందరి ప్రజల అభ్యున్నతి కోసం విజ్ఞానం అంతమైన సమాజం కోసం పాటుపడటం నేటి అవసరమని సమావేశం తీర్మానించింది. మానవత జిల్లా నాయకులు దేవినేని భాస్కరరావు, అడుసుమిల్లి నిర్మల, పీడీ రత్నాకరరావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నాయకులు గుడిపాటి నరసింహారావు, వై.ఆనందనాయుడు, పి.అంజనేయులు, హేలాపురి బాలోత్సవం నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, కె.సోమ్మానాయక్, వి.సూర్యప్రకాష్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.ముస్తఫా అలీ, జనవిజ్ఞాన వేదిక నాయకులు కెవి.నారాయణరావు హాజరయ్యారు. 25వ తేదీ కళా సాంస్కృతిక సమాలోచన సభ ఫ్లెక్సీని, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళల సమస్యలపై చిత్రలేఖనం పోటీలు, "మహిళా చైతన్యం రాజా రామ్మోహన్ రాయ్ కందుకూరి సంఘం కృషి నేటి ప్రత్యేకత" అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, మహిళలు, పురుషులైనా స్త్రీలైనా ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొని తమ ఇష్ట వద్ద చిత్రలేఖనం, వ్యాసరచన చేసి 21వ తేదీ సాయంత్రం లోగా పవర్ పేటలోని అన్నే భవనంలో ఉన్న ఎవిఆర్ విజ్ఞాన కేంద్రానికి అందించాలని తెలిపారు. మానవతా జిల్లా అభివృద్ధి చైర్మన్ అడుసుమిల్లి నిర్మల, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడారు. ఈ సమావేశం సభలో రాజారామ్మోహన్ రాయ్ జీవితం గురించి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎన్.రమేష్, కందుకూరి వీరేశలింగం జీవితంపై రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ బి.ఇమ్మానియేల్ మాట్లాడతారని, ముఖ్య అతిథులుగా డాక్టర్ జెఆర్‌యుఆర్.గోపాలకృష్ణయ్య, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఆర్.రవికుమార్, ఆర్.మనిసింగ్ అతిథులుగా బిఎస్.సాగర్, కె.రామాంజనేయులు, పి.పురుషోత్తం పలు కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె ముస్తఫా అలీ, హేలాపురి సమ్మర్ క్యాంపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆప్కాబ్ చైర్మన్ పదవితో గన్నికి సముచిత స్థానం

ఎంపీ మహేష్‌కుమార్ అభినందన

ప్రజాశక్తి - భీమడోలు

ఆప్కాబ్ చైర్మన్‌గా నియమించడం ద్వారా టిడిపి అధిష్టానం గన్ని వీరాంజనేయులుకు సముచిత స్థానం కల్పించిందని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులును భీమడోలులోని ఆయన నివాస గృహంలో ఆదివారం సంయుక్తంగా కలిసిన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ పొత్తు ధర్మాన్ని పాటిస్తూ తన సీటును గన్ని వీరాంజనేయులు త్యాగం చేశారని గుర్తు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో తనతో పాటు పార్లమెంటు పరిధిలోని ఏడుగురు కూటమి ఎంఎల్‌ఎ అభ్యర్థుల గెలుపులో గన్ని వీరాంజనేయులు కీలక పాత్ర పోషించారన్నారు. ఆప్కాబ్ చైర్మన్ పదవి ద్వారా గన్ని వీరాంజనేయులు పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. అనంతరం గన్ని వీరాంజనేయులుకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి సన్మానించి ఎంపీ అభినందించారు.



ఏలూరులో...

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఆదివారం చాలా ఉత్సాహంగా జరిగాయి. ముందుగా గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు చదవటం మాకిష్టం-పుస్తక పఠనంలో ఇద్దరు ప్రాణ మిత్రులు నీతి కథలను బోధించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ కె.త్రినాథ్‌నాయక్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ ఆంగ్ల భాషలో సులువుగా మాట్లాడడంపై శిక్షణ అందించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ వై.ఫణికాంత్ ప్రముఖ డాన్స్ మాస్టర్ విద్యార్థులకు అనేక రీతిల్లో నృత్యాలపై శిక్షణ ఇచ్చారు. చిన్నారులందరికీ స్నాక్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్‌కుమార్, ఎండీ.అస్లాంపాషా, బివిఎస్.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు : పోతునూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో 12 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా నీతి పద్యాలు చదివించారు. నీతి వాక్యాలు చెప్పించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గ్రంథాలయంలో చదువుకుని ప్రపంచ మేధావి అయ్యారని వివరించారు. మీరు కూడా గ్రంథాలయాన్ని వినియోగించుకుని భవిష్యత్తులో మంచి స్థితిలో ఉండాలని చెప్పారు. తరువాత చదరంగం ఆడించారు.

చాట్రాయిలో తిరంగా యాత్ర

ప్రజాశక్తి - చాట్రాయి

భారత సైనికులకు మద్దతుగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో చాట్రాయిలో ఆదివారం తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ సరిహద్దులో త్రివిధ దళాల సైనికులు చేస్తున్న పోరాటం, త్యాగాల వల్లే భారత భూభాగంలో మనందరం ఆనందంగా జీవిస్తున్నామన్నారు. చాట్రాయి ఎన్‌టిఆర్ సెంటర్ వికాస్ స్కూల్ దగ్గర నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ తిరంగా యాత్రలో తహశీల్దార్ ఈశ్వర్, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఎంఇఒ బ్రహ్మాచారి, ఎపిఎం వెంకటేశ్వరరావు, మందపాటి బస్వారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, మందలపు జగదీష్, బొట్టు లక్ష్మణరావు, బిజెపి నాయకులు రాజ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని రమణక్కపేటలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో మిట్టగూడెం గ్రామానికి చెందిన పోలగంటి చంటి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారాను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అతనికి సారా సరఫరా చేస్తున్న రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట గ్రామానికి చెందిన భరత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


శ్రీరామవరంలో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - టి.నరసాపురం

గడ్డివామి దగ్ధమైన సంఘటన మండలంలోని ఎపిగుంట పంచాయతీలోని శ్రీరామవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాళ్నీడి సుబ్బారావుకు చెందిన గడ్డివామికి గుర్తు తెలీని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. బిందు సేద్యం పరికరాలు సైతం పూర్తిగా కాలిపోయాయని, సుమారు రూ.ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న చింతలపూడి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అగ్నిప్రమాద స్థలానికి చేరుకుని స్థానికులతో కలిసి మంటలు ఆర్పడానికి ప్రయత్నించిన ఫలితం లేకపోయింది.

ఉత్తమ విద్య, క్రమశిక్షణ కుమార్ విద్యాసంస్థల సొంతం

మూడు దశాబ్దాలుగా ఉత్తమ ఫలితాలు
అధినేత పి.వి.కుమార్, స్టే బోర్డు కరస్పాండెంట్ సంధ్యాలక్ష్మి



పి.వి.కుమార్



సంధ్యాలక్ష్మి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గంలో క్రమశిక్షణ, ఉత్తమ విద్య, అత్యుత్తమ ఫలితాలకు నిలయంగా కుమార్ విద్యాసంస్థ నిలుస్తుందని ఆ విద్యాసంస్థ అధినేత పి.వి.కుమార్, స్టేట్ బోర్డ్ కరస్పాండెంట్ సంధ్యాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. తాను 1993లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి పిజి డిప్లమో కంప్యూటర్స్ చేసేందుకు విజయవాడ వెళ్తున్న సమయంలో ట్యూషన్స్ చెప్పాలంటూ విద్యార్థులు రావడంతో కాదనలేక విద్య బోధన చేసినట్లు తెలిపారు. కొందరు విద్యార్థులకు ప్రారంభమైన ట్యూషన్ నేడు ఓ పెద్ద విద్యాసంస్థగా రూపాంతరం చెందిన తీరు నిజంగా చరిత్ర సృష్టించిన అంశమేనన్నారు. తన తండ్రి వెంకట కృష్ణారావు ఆర్‌టిసి ఉద్యోగి కావడంతో తోటి ఆర్‌టిసి ఉద్యోగులకు చెందిన ముగ్గురు పిల్లలకు ట్యూషన్స్ చెప్పాలని 1993లో తన వద్దకు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆనాడు తాను పీజీ, డిప్లమో, ఇన్ కంప్యూటర్స్ ట్రైనింగ్ కోసం ప్రతిరోజూ విజయవాడ వెళ్లి వచ్చినట్లు తెలిపారు. ముగ్గురు విద్యార్థులకు ట్యూషన్స్ చెప్పేందుకు ముందుగా తాను విద్యార్థిగా మారి ఆయా తరగతులకు చెందిన పుస్తకాలను బస్సు ప్రయాణంలో చదువుకుని అర్థం చేసుకోవడం బాధ్యతగా మారిందన్నారు. ఇలా 50 రోజులు గడిచేసరికి 30 మంది విద్యార్థులు, 1998 నాటికి 300 మంది విద్యార్థులు తన వద్దకు చేరుకున్నట్లు తెలిపారు. చదువు చెప్పేందుకు విద్యార్థుల కోసం ఓ భవనం హద్దెకు తీసుకుని ముగ్గురు ఉపాధ్యాయులతో విద్యాబోధన కొనసాగించినట్లు తెలిపారు. ఆనాడు విద్యార్థులకు పరీక్షలు వచ్చే సమయంలో విద్యాలయం వద్దనే నిద్రించి అన్నివేళలా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసినట్లు తెలిపారు. ఆనాటి వరకు విద్యార్థులు ఇచ్చిన మేరకు ఫీజులు తీసుకున్నట్లు చెప్పారు. సంధ్యాలక్ష్మితో 1997లో వివాహం జరిగినట్లు చెప్పారు. కుమార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ పేరిట 1998లో మొట్టమొదట రసీదు పుస్తకం ముద్రించిన నాటి జ్ఞాపకాలను వివరించారు. కుమార్ విద్యాసంస్థను 2000లో ఏడో తరగతి వరకు ప్రారంభించినట్లు తెలిపారు. నాటి ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్‌పి సివి.ఆనంద్ తమ పాఠశాలను పదో తేదీ ఏప్రిల్ 2000లో ప్రారంభించినట్లు చెప్పారు. తమ విద్యాసంస్థకు చెందిన వాల్ పోస్టర్లను తానే స్వయంగా అంటించిన మధుర క్షణాలను తెలిపారు. ఆనాడు 190 మంది విద్యార్థులు, తొమ్మిది మంది ఉపాధ్యాయులతో పాఠశాల కొనసాగిం దన్నారు. పదో తరగతి 2004లో ప్రారంభించాక ఆనాడు 40 మంది పదో తరగగి విద్యార్థులు, మొత్తం పాఠశాల విద్యార్థులు 900 మంది చదివినట్లు తెలిపారు. నేడు 1900 మంది విద్యార్థులు చదువుతుం డగా 130 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం కుమార్ సిబిఎస్‌ఇ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రారంభించామని, అందులో 800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా 60 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నట్లు వివరించారు.

ప్రతిరోజు మొట్టమొదటి విద్యార్థి తానే

విద్యార్థి దశలో క్రమశిక్షణ, ఉత్తమ పౌరులుగా ఎదగడం, చదువు పట్ల శ్రద్ధ శక్తులు పెంపొందడం ఎంతో అవసరమన్నారు. నేటికీ తమ విద్యా సంస్థకు చేరుకునే ప్రతిరోజు మొట్టమొదటి విద్యార్థి తానేనని గర్వంగా తెలిపారు. నిత్య విద్యార్థిగా ప్రతి అంశాన్ని పరిశోధించి, పరిశీలించి అర్థం చేసుకుని అన్వయించుకునేతత్వం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుందన్నారు. తమ విద్యాసంస్థల్లో 200 మంది విద్యార్థుల వరకు మైక్ లేకుండానే విద్యాబోధనతో పాటు అనేక అంశాల్లో సూచనలు చేస్తూనే ఉన్నట్లు చెప్పారు.

అవార్డుల పంట

సామాజిక స్పృహతో కార్పొరేట్ విద్యావ్యవస్థకు వ్యతిరేకంగా ప్రదర్శించిన కాళ్ల గజ్జ కంకణమ్మ నాటికకు 2011లో ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి చేతులమీదుగా నంది అవార్డు లభించడం తమ విద్యాసంస్థకు, విద్యార్థులకు ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న తరుణంలో రెండుసార్లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ఎంతో గురుతర బాధ్యతను గుర్తు చేసిందన్నారు. సమైక్యాంధ్ర కోసం చేసిన ఉద్యమం గొప్ప స్ఫూర్తిని రగిలించిందన్నారు. ఈ ఉద్యమం నేపథ్యంలో సిఎం చంద్రబాబు సన్మానం చేయడం సామాజిక స్పృహ పట్ల మరింత బాధ్యతను పెంపొందించిందన్నారు. ప్రతిసారి సామాజిక అంశాల పట్ల ప్రతిస్పందిస్తూ ప్రజల పక్షాన నిలబడి, కలబడి పోరాడిన ఘన చరిత్ర కుమార్ విద్యాసంస్థలకు దక్కుతుందన్నారు. తమ విద్యాసంస్థ నుంచి ఇప్పటి వరకు సుమారుగా ఆరు వేల మంది విద్యార్థులు బయటకు రాగా 95 శాతం వివిధ విభాగాల్లో స్థిరపడి గొప్పగా జీవించడమే తమ నిజమైన ఆస్తిగా తెలిపారు. నూజివీడు కుమార్ విద్యాసంస్థల్లో చదివితే తమ చిన్నారుల భవిష్యత్తుకు పూర్తి భరోసా లభిస్తుందని, అక్కడ చదివిన విద్యార్థులు త్వరగా సెటిల్ అవుతారనే నానుడి ఎంతో గర్వంగా ఉంటుందని చెప్పారు. తమ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు చెప్పారు. మంచి స్టేట్ బోర్డు విద్యాలయం ఏర్పాటు చేయాలని సదాశయంతో ప్రణాళిక బద్ధంగా కృషి చేయడమే తన లక్ష్యమన్నారు. తమ విద్యాసంస్థలో చదివిన విద్యార్థి అనిల్ కుమార్ ఢిల్లీ ఎయిమ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. తమ విద్యాసంస్థ ఇంత గొప్పగా ఎదిగేందుకు అత్యుత్తమ పౌరులను తీర్చిదిద్దేందుకు ఎన్నో గొప్ప ఫలితాలను సాధించడంలోనూ అనుక్షణం తోడ్పాటు అందించిన విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎన్నటికీ మరువలేనిదని తెలిపారు.




కుమార్ విద్యాసంస్థల భవనం

పేదల పూర్తి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

మంత్రి కొలుసు పార్థసారథి
సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేదల పూర్తి ఆరోగ్య భద్రతలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. నూజివీడు నియోజకవర్గంలో నూజివీడు పట్టణం, చాట్రాయి మండలంలో సిఎం సహాయ నిధి నుంచి 102 మందికి సుమారు రూ.72 లక్షల చెక్కులను ఆయన అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలకు చికిత్స చేయించుకున్న వారు ఆర్థిక సాయం కోసం కుటుంబసభ్యులు మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకురాగా కొన్ని నెలల్లో సిఎం సహాయనిధి చెక్కులను కుటుంబ సభ్యులకు అందించారు. సిఎం సహాయ నిధి నుంచి చెక్కులు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం పేదల వైద్యం కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఆధునిక వైద్యపరికరాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. పేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా గతంలో వైద్యం చేయించుకున్న మెడికల్ బిల్స్ ఉంటే సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తానని, నేరుగా తనను కలిసి ఆర్థిక సహాయం పొందవచ్చని చెప్పారు. వైద్యం కోసం ఎమర్జెన్సీ సమయంలో నేరుగా తనతో మాట్లాడి ప్రభుత్వం నుంచి మెరుగైన వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న మంత్రి పార్థసారథి

ఎన్‌సిసి యూనిట్ మంజూరు కోరుతూ ఎంపీకి వినతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి ఎన్‌సిసి యూనిట్ మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు ఆ కాలేజీ పూర్వ విద్యార్థి, న్యాయ శాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు బొమ్మిడి అప్పారావు వినతిపత్రం అందించారు. ఏలూరు ఎంపీ ఆదివారం చేబ్రోలు వచ్చారు. నారాయణపురం కాలేజీకి దాదాపు 25 గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారని, విశాలమైన క్రీడా మైదానం, వసతులు ఉన్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎన్‌సిసి యూనిట్ మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో ఆదివారం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1999-2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ముదినేపల్లి హైస్కూల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను తలచుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు వి.విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, దుర్గాదేవి, రాంబాబు, సాయి, విజయలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్
లింగపాలెంలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలో చింతలపూడి నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని తెలిపారు. చింతలపూడి వంద పడకల ఆసుపత్రి పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ 11 నెలల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమలు చేపట్టినట్లు తెలిపారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర రావటానికి కృషి చేస్తున్నానన్నారు. పామాయల్ రైతులు 50 శాతం రూ.20 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని తెలిపారు. కోకో రైతులకు గిట్టుబాటు ధర కోసం, జోన్ క్రియేట్ చేయటానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జంగారెడ్డిగూడెం రోడ్లు త్వరలో వేస్తామన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో ముందుందని తెలిపారు. అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ 27, 28, 29 జరిగే మహానాడుకు ప్రతిఒక్కరూ రావాలన్నారు. బిసి రాష్ట్ర నాయకులు దాసరి శేషు మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గం రైల్వే ట్రాక్ నిర్మించాలని కోరారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ మురళీ రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాలుగు మండలా అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మినీ మహానాడులో ఎంపీ, ఎంఎల్‌ఎలు, నాయకులు

పైసలిస్తేనే పని జరిగేది!

ఏ పని జరగాలన్నా ఆయన కనుసన్నల్లోనే
ముదినేపల్లి మండలంలో ఒక ఉద్యోగి నిర్వాకం

ప్రజాశక్తి -ముదినేపల్లి

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ముదినేపల్లి మండల రెవెన్యూ శాఖ తీరు మారడం లేదు. లంచం ఇవ్వనిదే పని చేయడం లేదు. ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించేశారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ మొత్తం అందరినీ భయపెట్టేస్తున్నారు. ఆ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా ఆయన చేయి తడపాల్సిందే. ఆ ఉద్యోగికి కొంతమంది ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో పలు రికార్డుల్లో పేర్లు మార్పులు చేస్తున్నట్లు సమాచారం. ఆడంగళ్‌లో పేరు మార్చాలంటే వేలాది రూపాయలు చెల్లించాల్సిందే. ఆయన మండల కేంద్రం ముదినేపల్లిలో గ్రామ రెవెన్యూ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు.

ప్రతి రోజు మండల రెవెన్యూ కార్యాలయానికి వస్తుంటారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు తదితర పనులు చేయాలంటే పైకం చెల్లిస్తే గాని ఆయన పనిచేయరు. వసూల్ రాజు కారణంగా రైతులు, రెవెన్యూ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ముదినేపల్లి విఆర్‌ఒ కార్యాలయంలో పని చేయాల్సిన విఆర్‌ఎ మండల తహశీల్దార్ కార్యాలయంలో పదేళ్లుగా తిష్ట వేశారని గ్రామస్తులు చెబుతున్నారు. విఆర్‌ఒ కార్యాలయంలో తన విధులు నిర్వహించకుండా తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఎన్‌ఒసి సర్టిఫికెట్లు, డెత్, బర్త్, తదితర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెరిఫికేషన్ వ్యవహారాలు చేస్తున్నారని చెబుతున్నారు. రైతులను, ప్రజలను భయాందోళనకు గురి చేస్తూ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాడని, ఒక్కో సర్టిఫికెట్ కోసం కనీసం రూ.ఐదు వేలు ఇస్తేనే సర్టిఫికెట్ వారికి ఇవ్వడని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎవరైనా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే సంబంధిత గ్రామ విఆర్‌ఒ, ఆర్‌ఐ వెరిఫికేషన్ కోసం దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లాలి. అయితే ఇక్కడ అలా జరగదు. సదరు విఆర్‌ఎ బైక్‌పై బయలుదేరి దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తహశీల్దార్ కార్యాలయం నుంచి వచ్చానంటూ పరిచయం చేసుకుంటాడు. దీంతో జనం విఆర్‌ఎను అంతా ఆర్‌ఐగా పరిగణిస్తున్నారు. దీంతో కొందరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి ఆర్‌ఐ ఎక్కడంటూ సదరు విఆర్‌ఎ అడుగుతుండడంతో అందరూ అవాక్కవుతున్నారు.

విఆర్‌ఎ పనితీరుతో...

విఆర్‌ఎలోని తన కార్యాలయంలో విధులు నిర్వహించకుండా తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో మండలంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ ఒకో సర్టిఫికెట్ ఒక రేటు చొప్పున వసూలు చేస్తున్నాడు. సర్టిఫికెట్ల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాడని, దీంతో సదరు విఆర్‌ఎ చేష్టలతో మండల రెవెన్యూ యంత్రంగానికి మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

విఆర్‌ఎకు రాజకీయ నాయకులు అండదండలు

ఏ ప్రభుత్వం మారినా సదరు విఆర్‌ఎకు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వంలోనూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ విఆర్‌ఎకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయి. మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగే ప్రతి విషయాన్ని రాజకీయ నాయకులకు చేరవేస్తూ ఉంటాడని, దీంతో విఆర్‌ఎ తప్పు చేసినా రాజకీయ నాయకులు అతడిని కాపాడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

ఇక్కడి నుండి కదలడు

సదరు విఆర్‌ఎపై వస్తున్న ఆరోపణ నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి అతని గ్రామం పంపాలంటూ మండల విఆర్‌ఒల సంఘం మండల రెవెన్యూ అధికారులను పలుసార్లు కోరింది. విఆర్‌ఎను తన గ్రామం పంపాలంటూ పలువురు తహశీల్దార్లకు విన్నవించారు. మండల విఆర్‌ఒల సంఘం విఆర్‌ఎను అతని గ్రామం పంపాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలమవుతున్నాయి.

డబ్బుల వాటాల విషయంలో ఘర్షణ

ఆ ఉద్యోగి ముదినేపల్లిలో తన కార్యాలయంలో పనిచేసే సమయంలో విఆర్‌ఎకు, విఆర్‌ఒకు మధ్య డబ్బుల పంపకం విషయమై గొడవ జరిగిందని, ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో విషయం బయట పడిందని ప్రజలు చెబుతున్నారు. దీంతో అప్పటినుంచి సదరు ఉద్యోగి విఆర్‌ఒ వద్ద పని చేయకుండా తహశీల్దార్ కార్యాలయంలో మకం వేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో మండలంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ వసూళ్ల దందా కొనసాగిస్తున్నాడని ఆరోపిస్తున్నారు.

పట్టాదార్ పాస్ పుస్తకాలకు భారీగా డబ్బు..

పట్టాదారు పాస్ పుస్తకాలకు భారీగా ముడుపులు వసూళ్లు చేస్తున్నట్లు, అధికారుల, ప్రజా ప్రతినిధుల అండదండలతో పలు రికార్డుల్లో పేర్లు మార్పు చేస్తున్నట్లు సమాచారం. అడంగల్ పేరు మార్చాలంటే వేలాది రూపాయలు చెల్లించాలని, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇళ్ల స్థలాలకు ఎంజాయ్‌మెంట్ తదితర సర్టిఫికెట్ల పనులకు పైకం చెల్లిస్తే గాని పని జరగని పరిస్థితి అని పలువురు చెబుతున్నారు. సదరు ఉద్యోగిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, ఉద్యోగిని తహశీల్దార్ కార్యాలయం నుంచి తన గ్రామం పంపించే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనాథ మృతదేహానికి రైతుల అంత్యక్రియలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి అన్నదాతలు తమ పెద్ద మనసును చాటుకున్నారు. వరికూటి రమేష్ అనే వృద్ధుడిని జంగారెడ్డిగూడెం రోడ్డులోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఈ నెల 17వ తేదీన గుర్తు తెలీని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వృద్ధుడిని అన్నదాతలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు చెత్త సామగ్రి సేకరిస్తూ జీవించేవాడు. మృతుడికి సంబంధించినవారు ఎవరు లేకపోవడంతో రైతులు కోన దయరాజు, శుక్లబోయిన సుబ్బారావు తదితరులులు సొంత ఖర్చులతో హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

భాస్కరవర్మకు ఎంఎల్‌ఎ కామినేని పరామర్శ

ప్రజాశక్తి - మండవల్లి

మృత్యువు మిగిల్చిన బాధ ఎవరూ తీర్చలేనిదని, మనోధైర్యాన్ని పెంపొందించుకుని ఆరోగ్యంగా ఉండాలని కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ తెలిపారు. భైరవపట్నం గ్రామ ప్రముఖులు, ప్రముఖ చేపల రైతు గాదిరాజు భాస్కరవర్మ సతీమణి భారతి ఇటీవల మృతి చెందారు. ఆదివారం భాస్కరవర్మను ఎంఎల్‌ఎ శ్రీనివాస్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మృత్యువు అనేది అనివార్యం అయినప్పటికీ మరణం వల్ల కలిగే నష్టం అంతా ఇంతా కాదన్నారు. ఒక్కసారిగా కుటుంబమంతా కుంగిపోతుందన్నారు. ముదునూరు సీతారామరాజు, పలువురు చేపల రైతులు పరామర్శించారు.

టిడిపి లోపూడి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని లోపూడి టిడిపి అధ్యక్షుడిగా చలమాల వెంకటేశ్వరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప అధ్యక్షులు ఎలికే వెంకటేశ్వరావు, జనరల్ సెక్రటరీ డోలా రాంబాబు, ట్రెజరరీ పంజగల వెంకయ్య ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పార్టీ గ్రామ మాజీ అధ్యక్షులు వేంపాటి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ వేంపాడు మేజర్ పరిధిలో వాటర్ యుజార్ అసోసియేషన్ మెంబర్‌గా పని చేస్తున్న చలమాల వెంకటేశ్వరరావు టిడిపి గ్రామ అధ్యక్షుడిగా ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సభ్యత్వాల ఐడెంటిటీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

మాదేపల్లి గ్రామంలో జనసేన పార్టీ అధ్యక్షులు మోటేపల్లి పవన్ కుమార్ ఆధ్వర్యంలో జనసేన సభ్యత్వం తీసుకున్న 320 కార్యకర్తలకు సభ్యత్వాల ఐడెంటిటీ కార్డులు ఇంటింటికి తిరిగి జన సైనికులు అందించారు. మాదేపల్లిలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన రమణ పాల్గొన్నారు.

ప్రకటన

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE BHIMAVARAM

O.S.NO.17/2025

Between

Plaintiff : **UNION BANK OF INDIA BHIMAVARAM BRANCH Rep by its Branch manger**

Defendants :

M/s.SOWJANYA CENTRING WORKS
Prop:**Penumaka Sowjanya & anothers**

1st Defendant address :
M/s.Sowjanya Centring works
Prop: **Penumaka Sowjanya**, D.No. 2-109,four Number peta, Vissa koderu Palakoderu Mandalam.

2st Defendant address :
Penumaka Sowjanya,W/o. Penumaka Babu, Four Number peta, Vissa koderu Palakoderu Mandalam.

పై నంబరు దావా లో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అవి అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది తరుపున ప్రతి వాదులపై శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు **ది.18.06.2025** తేదిన ఉదయం 10.30 ని॥లకు కోర్టువారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను.

లేని యెడల శ్రీ కోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారిచేయగలరని తెలియజేయుచున్నాము

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

ఆల్తి శివరామకృష్ణ అడ్వకేట్,
శ్రీరామపురం,భీమవరం-2
సెల్ : 98484 60585

భీమవరం
ది.18.05.2025

ప్రకటన

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు తణుకు

O.S.No. 606/2020

Between:

కుడిపూడి రామకృష్ణ ...వాది

మరియు

1. కుడిపూడి పద్మ
2. కుడిపూడి చిట్టి ...ప్రతివాదులు

వాది తరుపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు గ్రంధములో మరియు IA No. 1131/2021 పిటీషన్లులో మీకు ఇరువురికి అనగా మీలో 1వ వారికి నేరుగాను మీలో 2వ వారు మైనరు అయినందున 1వ వారి పేర ఎన్నిసార్లు సమన్లు శ్రీ కోర్టు వారి ద్వారా పంపినను మీరు తీసుకొనక, కావాలని త్రిప్పి పంపించుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఆదేశానుసారము మీకు ఇరువురికి ఈ ప్రకటన ద్వారా సమన్లు జారీచేయబడినవి. కావున మీరు శ్రీ కోర్టు వారి ఎదుట **ది. 18-06-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరు కావలెను. అట్లు కాని యెడల పై నెంబరు గ్రంధము మీ పరోక్షములో విచారణ జరుగునని మీకు ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

ఆర్. వెంకటేశ్వరరావు
అడ్వకేట్, తణుకు
సెల్ నెం: 93467 21735

తణుకు
ది.18-05-2025